# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం ప్రజలకు అందించడంలో సమాచార ప్రసార విభాగాలు కీలకంగా వ్యవహరించాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయమంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ పేర్కొన్నారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణం శాఖలపై ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **చెత్త ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.**
4. **గిరిజన పంట ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్‌కు వీలుగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జి సంధ్యారాణి తెలిపారు.**
5. **ఈరోజు ప్రపంచ దోమల నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు.**
6. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ విభాగాలన్నింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేసే బాధ్యత ఉందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ అన్నారు. నిన్న చెన్నైలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కేంద్ర సమాచార, ప్రసార విభాగాల కార్యకలాపాలపై కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ మురుగన్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాల సమాచారం ప్రజలకు అందించడంలో ప్రచార విభాగాలు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలకు చెందిన పిఐబి, సిబిసి, సెన్సార్ బోర్డు, ప్రచురణ విభాగం, ఆకాశవాణి, దూరదర్శన్‌ల ప్రాంతీయ విభాగాధిపతులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ పర్యారణం శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించే ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో చేపట్టబోతున్న

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, ఈ నెల 23వ తేదీన గ్రామసభల నిర్వహణపై చర్చిస్తున్నారని అధికారులు తెలిపారు. అటవీ, పర్యావరణం సమీక్షలో ఎర్రచందనం అక్రమరవాణా కట్టడి, మొక్కల పెంపకం, పట్టణ అటవీకరణ వంటి అంశాలపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చెత్త ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బయోగ్యాస్ ఉత్పత్తిపై సంబంధిత అధికారులతో సచివాలయంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలుత ఒక మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాలని చెప్పారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పొదుపు సంఘాల మహిళలు తయారు చేస్తున్న 107 రకాల ఉత్పత్తులకు మరింత మెరుగ్గా మార్కెటింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలపైనా సమావేశంలో చర్చించినట్లు అధికారులు పేర్కొన్నారు.

---------------------------

అరకు కాఫీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. నిన్న విశాఖపట్నంలోని గిరిజన సహకార సంస్థ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం 600 మెట్రిక్ టన్నులుగా ఉన్న కాఫీ సేకరణను 18 వందల టన్నులకు పెంచాలని స్పష్టం చేశారు. నర్సీపట్నం కేంద్రంగా ఐదెకరాల్లో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన పంట ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్‌కు వీలుగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

---------------------------

ఈరోజు ప్రపంచ దోమల నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ శాస్త్రవేత్త, వైద్యులు రోనాల్డ్ రాజ్ దోమల ఉనికికి సంబంధించి జరిపిన చారిత్రాత్మక ఆవిష్కరణకు గుర్తుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల వల్ల డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించడమే దోమల నివారణ దినం నిర్వహణలోని ముఖ్యోద్దేశం. దోమల కారణంగా వచ్చే వ్యాధులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాయి. 'మరింత మెరుగైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని తీవ్రతరం చేయడం' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ దోమల నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

భౌతిక శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్, మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త ఏ.పీ.జె. అబ్దుల్ కలాం అందించిన

స్ఫూర్తితో అంతరిక్ష పరిశోధనలో భారత్ అనేక గొప్ప విజయాలను సాధిస్తోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్స వాన్ని పురస్కరించుకొని విజయవాడలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 'అప్లికేషన్స్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ ఇన్ వేరియస్ వాక్స్ ఆఫ్ లైఫ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగిచారు. అంతరిక్ష సాంకేతికతలో భారత్ గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందన్నారు. చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సురక్షితంగా దిగినందుకు గుర్తుగా ఈ ఏడాది ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు.

---------------------------

విద్యుత్ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం –పీఎంఎస్‌జీవై ద్వారా సులభతరంగా సౌర శక్తి పైకప్పు ఏర్పాటు చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ–ఏపీఎస్పీడీసీఎల్ అధికారి ఎస్. రమణ పేర్కొన్నారు. నిన్న కడపలో ఆయన మాట్లాడుతూ, పీఎంఎస్‌జీవై పథకం ద్వారా ప్రభుత్వ రాయితీతో సౌర శక్తి పైకప్పును ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు –ఏడీబీ ప్రతినిధి బృందాలు ఈరోజు నుంచి ఈనెల 27 వరకు రాజధాని అమరావతిలో పర్యటించనున్నాయి. పర్యటనలో భాగంగా రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో బ్యాంకు ప్రతినిధులు సమావేశమవుతారని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక వనరులకు అవకాశం, దశలవారీగా ప్రణాళికలు, వాటి అమలు తదితర అంశాలకు సంబంధించి ఉన్నతాధికారులతో చర్చించి కార్యాచరణ రూపొందించే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సచివాలయంలోనే అత్యున్నత స్థాయి సమావేశంలో పాల్గొంటారని, ప్రభుత్వ ప్రాధాన్యతలు, విధానపరమైన కార్యాచరణపై ముఖ్యమంత్రి ఏడీబీ బృందాలకు వివరించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ఈరోజు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి జనరల్ మేనేజర్, కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల సహకారంతో ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు నిర్వహించే ఈ సదస్సులో వివిధ శాఖలకు చెందిన కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త నేర చట్టాలపై జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసరావు సూచించారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో దేశంలోని జైళ్ల అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత జాతీయ స్థాయి సదస్సు నిన్న విశాఖపట్నం కేంద్ర కారాగారంలో నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐజీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కొత్త క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షసం హిత, భారతీయ సాక్ష్య

అధినియం గురించి తెలియజేసేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాలలో ఉన్న సెక్షన్లు, కొత్త నేర చట్టాలలో వాటిని ఏ విధంగా మార్చారో అవగహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల అనుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ సి. హెచ్. చేతన్ అన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమలు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సభ్యులతో కలెక్టర్ నిన్న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నిబంధనలను సరళీకృతం చేసిందన్నారు. అలాగే నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

======================